
26-03-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 186 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

జయభేరి









# రేవంత్ ఇంటికి క్యూ కడుతున్న ఆశావహులు

తెలంగాణలో మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం అమోద ముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పెద్దలు మంత్రి వర్గ విస్తరణకు సానుకూల సంకేతాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. తాజా మంత్రి వర్గ విస్తరణలో కనీసం నలుగురికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉన్నట్టు సమాచారం.

**జయభేరి, హైదరాబాద్, మార్చి 25 :**

మంత్రి పదవులతో పాటు డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను సైతం భర్తీ చేయనున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు. సీఎం రేవంత్ బృందం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశం అయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.కాంగ్రెస్ పెద్దలతో జరిగిన భేటీలో తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, మంత్రివర్గ విస్తరణలో ఎవరికి అవకాశం కల్పించాలనే అంశాలపై చర్చించారు. దీంతో పాటు ఏప్రిల్ 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ అంతర్జాతీయ సదస్సుపై సుదీర్ఘంగా చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు వివరించాయి. హైదరాబాద్‌లో జరిగే భారత సంవిధాన్ సమావేశాలకు సుమారు 80 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ కీలక నేతలతో జరిగిన భేటీలో తెలంగాణ మంత్రి వర్గ విస్తరణపై ఎక్కువగా చర్చ జరిగినట్టు నేతలు వివరించారు. ప్రస్తుతం తెలంగాణ మంత్రి వర్గంలో ఆరుగురికి చోటు కల్పించేందుకు అవకాశం ఉంది.

...మిగతాది 2 లో



## పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్

2 లో

## భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్న కెనడా

- సార్వత్రిక ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆరోపణ



**జయభేరి, న్యూ ఢిల్లీ, మార్చి 25 :**

భారత్‌పై కెనడా మరోసారి నోరు పారేసుకుంది. ఆ దేశంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. భారత్‌తోపాటు చైనా, రష్యా, పాకిస్థాన్ దేశాలు కూడా ఆ ప్రయత్నం చేయొచ్చన్న అనుమానాలు వ్యక్తం చేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.'త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు పీఆర్‌సీ (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఏఐ ఆధారిత సాధనాలను ఉపయోగించే

...మిగతాది 2 లో

# తగినన్ని నిధులు ఇస్తాము

## సీజనల్ వ్యాధులు ప్రబలటానికి వీల్లేదు

- లైన్ డిపార్ట్మెంట్లు సమన్వయంతో వ్యవహరిస్తూ సీజనల్ వ్యాధులను నియంత్రించాలి
- అవసరమైన చోట్ల డ్రోన్ల సహాయాన్ని వినియోగించుకోవాలి
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**జయభేరి, అమరావతి, మార్చి 25:**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తగినంత మొత్తంలో నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ సమావేశంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అంశంపై ఆయన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దోమల ద్వారా సంక్రమించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రాంతాలలో ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో యాంటీ

...మిగతాది 2 లో

## సురేఖను తప్పించి విజయశాంతి కి కాంగ్రెస్‌లో సంచలనం..?



**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో క్యాబినెట్ విస్తరణలో భాగంగా కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే కసరత్తు చేస్తున్న హై కమాండ్. సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం భట్టిలతో చర్చలు జరిగింది. సుదీర్ఘ చర్చల తరువాత కొత్తగా నలుగురు ఎమ్మెల్యేకు మంత్రి పదవులు ఇవ్వాలని

...మిగతాది 2 లో

## టన్నెల్ నుంచి మరో డెడ్ బాడీ లభ్యం



**జయభేరి, మహబూబ్ నగర్:**

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం నుంచి మరో మృతదేహాన్ని వెలికితీశారు. సహాయక చర్యల్లో భాగంగా మంగళవారం ఉదయం మృతదేహం ఆనవాళ్లను రెస్క్యూ టీమ్ గుర్తించింది. మధ్యాహ్నానికి మట్టిని తొలగించి మృతదేహాన్ని టన్నెల్ నుంచి బయటకు తీసుకొచ్చారు. అనంతరం అధికారుల అనుమతితో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని అంబులెన్సులో తరలించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మొత్తం 8 మంది చిక్కుకోగా, మూడు వారాల కిందట టన్నెల్ బోరింగ్ మేషిన్ ఆపరేటర్ మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగించగా..

...మిగతాది 2 లో



## ఒకే దేశం ఒకే ఎన్నిక

### కమిటీ పదవీకాలం పొడిగింపు

**జయభేరి, న్యూ ఢిల్లీ, మార్చి 25 :**

ఒకే దేశంఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం

...మిగతాది 2 లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల తీరుపై సుప్రీం అసహనం

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## రేవంత్ ఇంటికి క్యూ..

ప్రస్తుతానికి నలుగురికి అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. మిగిలిన రెండు ఖాళీలను మరో సారి భర్తీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై ఇప్పటికే పలుమార్లు చర్చలు జరగడంతో కూర్పుపై ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది.

**మంత్రి వర్గంలో చోటు దక్కేది వీరికే..**

2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పటికే మంత్రి వర్గంలో ఉండటంతో ఇద్దరికి అవకాశం ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కాంగ్రెస్‌లో చేరే సమయంలో హామీ ఇవ్వడంతో రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని చెబుతున్నారు.పెద్దపల్లి మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌కు కూడా మంత్రి పదవి దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలకు ముందు పార్టీలో చేరే సమయంలో మంత్రి పదవిపై హామీ ఇచ్చినట్టు చెబుతున్నారు.నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రి వర్గంలో ఎవరికి స్థానం దక్కలేదు.మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికు కూడా మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో సీఎం హామీ ఇచ్చారు. తాజా విస్తరణలో ఆయనకు కూడా చోటు దక్కుతుందని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రి వర్గంలో ఆరు ఖాళీలను భర్తీ చేస్తే ఎస్టీ, మైనార్టీవర్గాలకు చోటు దక్కనుంది.మల్రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఐలయ్య, ఆది శ్రీనివాస్, బాలూనాయక్, మురళీనాయక్, రాంచంద్రునాయక్, ప్రేమ్ సాగర్ రావు పేర్లపైన కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. డిప్యూటీ స్పీకర్‌గా లంబాడా వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు అవకాశం కల్పించనున్నారు. చీఫ్ విప్ పదవిగా ఆది శ్రీనివాస్ పేరు ప్రచారం జరుగుతోంది.

**మంత్రివర్గ విస్తరణకు పచ్చజెండా**

తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గం కూర్పు, కార్పొరేషన్ పదవుల భర్తీపై చర్చ జరిగినట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. అన్ని విషయాలపై లోతుగా సమాచారం తీసుకున్నారని త్వరలో అన్ని విషయాలూ కొలిక్కివస్తాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. తమ నుంచి సమగ్ర సమాచారం తీసుకున్నారని తుది నిర్ణయం ఏఐసీసీ తీసుకుంటుందని పీసీసీ అధ్యక్షుడు వివరించారు. తెలంగాణ మంత్రి వర్గ విస్తరణపై త్వరలో ప్రకటన ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

## తగినన్ని నిధులు ఇస్తాము

లార్వల్ ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ల ను వినియోగిస్తూ పిచికారి చేయించాలన్నారు. మానవ తప్పిదాల వల్ల ఈ వ్యాదులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపాలిటీ మరియు పంచాయతీరాజ్ శాఖలు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ ఇటువంటి కేసు ప్రబలినా ఆ కేసు పై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తాగునీరు కలుషితం ద్వారా వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, తాగునీరు కలుషితం కాకుండా తగు ముందస్తు చర్యలను చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల బోర్లు ఉన్నాయని, వాటన్నిటిని ముందుగానే ఫ్లష్ అవుట్ చేయించాలన్నారు. అయినప్పటికీ త్రాగునీరు కలుషితానికి అవకాశం ఉంటే, ఆయా బోర్లను వెంటనే తొలగించి వాటి స్థానంలో నూతన బోర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ నీరు కలుషితం కావడానికి వీల్లేదని, ఇందుకై ప్రోటోకాల్ ప్రకారం ఎస్ఓపిని పటిష్టంగా అమలుపరచాలని ఆదేశించారు. అదేవిధంగా త్రాగునీటి పైపుల లీకేజీకి ఏ మాత్రం అవకాశం లేకుండా చూడాలని, ప్రత్యేకించి మురుగు నీరు, వర్షపు నీటికి త్రాగు నీటి సరఫరా పైపులు ఏమాత్రం ఎక్స్పోజ్ కాకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్రాగు నీటి వనరులన్నిటిని ముందుగానే క్లోరినేషన్ చేసుకునే అంశంపై మున్సిపాలిటీ మరియు పంచాయతీరాజ్ శాఖలు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిపాలన పరమైన లోపాల వల్లే సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని,అందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. అవసరమైన నిధులను తగినంత మొత్తంలో మంజూరు చేస్తామని, తాగునీరు మాత్రం కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఆహారం కూడా కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మన పై ఉందని, ఇందుకు వ్యవసాయ, పౌరసరాలు, ఆరోగ్య శాఖల మంత్రుల బృందం ఈ అంశాన్ని ఇప్పటికే పర్యవేక్షిస్తున్నది అన్నారు. సురక్షితమైన ఆహార సరఫరా అంశాన్ని కూడా ఈ బృందమే పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల పాటు వడదెబ్బకు ఎక్కువగా గురి అయ్యే అవకాశాలు ఉన్నందున, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సాటించాలన్నారు. చల్లని నీటిని సరఫర చేసే చలివేంద్రాలను పెద్ద యెత్తున ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ఓఆరెస్ ప్యాకెట్లను, మజ్జిగ ప్యాకెట్లు కూడా సరఫరా చేయాలన్నారు. బహిరంగ మలవిసర్జనకు ఏ మాత్రం లేకుండా, వ్యక్తిగత టాయిలెట్లు ఉపయోగించుకునేలా చైతన్య పరచాలని, అవసరమైన చోట్ల వ్యక్తిగత టాయిలెట్స్ ను వెంటనే మంజూరు చేసి వాటి నిర్మాణాలను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఒకే దేశం ఒకే ఎన్నిక

తొలి రోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పీపీ చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జేపీసీకి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, మనీశ్ తివారీ, ప్రియాంక గాంధీ, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రాతో పాటు పలువురు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కాల పరిమితి ఏప్రిల్ 4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయ నిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, డిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా కమిటీ ఎదుట హాజరైన అభిప్రాయాలను తెలిపారు.

## మరోసారి నోరు పారేసుకున్న కెనడా

అవకాశం ఉందని మాకు సమాచారం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ఉద్దేశం, సామర్థ్యం భారత ప్రభుత్వానికి కూడా ఉందని మేం భావిస్తున్నాం. రష్యా, పాకిస్థాన్ దేశాల కూడా ఆ ప్రయత్నాలు చేయొచ్చు' అని లాయిడ్ ఆరోపించారు.కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 2019, 2021లో జరిగిన ఎన్నికల్లో భారత్, పాకిస్థాన్ దేశాలు జోక్యం చేసుకున్నట్లు కెనడా సెక్యూటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఆరోపణ చేసింది. ఈ ఆరోపణలపై ఆ దేశం దర్యాప్తునకు ఆదేశించింది. ఈ దర్యాప్తులో భారత్ జోక్యం చేసుకోలేదని తేలింది. కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని, ప్రధాని జస్టిస్ ట్రూడో విజయంలో ఆ దేశ పాత్ర ఏమీ లేదని కెనడా విచారణాధికారులు వెల్లడించారు. 2021లో జరిగిన జాతీయ ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని గుర్తించామని కెనడా సీనియర్ అధికారుల బృందం పేర్కొన్నది. అయితే గత రెండు ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నట్లు గుర్తించామని కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తెలిపింది. మరోవైపు కెనడా ఎన్నికల్లో జోక్యం చేసుకున్నట్లు గతంలో వచ్చిన ఆరోపణలను ఇండియా అప్పట్లోనే కొట్టిపారేసింది. ఇతర ప్రజాస్వామ్య దేశాల వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇప్పుడు మరోసారి భారత్‌పై ఒట్టావా అలాంటి ఆరోపణలే చేయడం గమనార్హం.

# పదేళ్లలో ఇండియా జీడీపీ డబుల్

భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతోంది. గతంతో పోలిస్తే ఆర్థిక వృద్ధి గాడిలో పడింది. కాస్త మందగమనం ఉన్నప్పటికి.. అనేక విషయాల్లో భారత ఆర్థిక వ్యవస్థ ముందంజలోనే ఉంది. ఈ క్రమంలో FY25లో భారతదేశ జీడీపీ వృద్ధి గత 10 సంవత్సరాలలో రెట్టింపు అయింది.



**2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.**

2015లో 2.1 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 4.3 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేయడం జరిగింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన డేటాలో ఈ సమాచారం ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం వల్ల, భారతదేశ జీడీపీ 2025లో జపాన్, 2027లో జర్మనీ కంటే ముందు వరుసలో నిలవనుంది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. ఇది విధాన సంస్కరణలు, బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా పేర్కొంది. 10సంవత్సరాలలో భారతదేశం తన స్థూల దేశీయోత్పత్తిని రెట్టింపు చేసి 105 శాతం వృద్ధిని నమోదు చేసిందని ఐఎంఎఫ్ డేటా తెలిపింది. 2015లో 2.1 ట్రిలియన్ డాటర్ల నుండి 2025లో 4.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. గతంలో పోల్చితే, అదే కాలంలో అమెరికా 66 శాతం, చైనా జీడీపీ 44 శాతం పెరిగాయి. దీంతో, భారతదేశం ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ (30.3 ట్రిలియన్ డాలర్లు), చైనా (19.5 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4.9 ట్రిలియన్ డాలర్లు), జపాన్ (4.4 ట్రిలియన్ డాలర్లు) తర్వాత ప్రపంచంలో పరంగా ఐదవ అతిపెద్ద దేశంగా భారత్ నిలిచింది. ఐఎంఎఫ్ డేటా ప్రకారం, గత దశాబ్దంలో జపాన్ జీడీపీ సున్నాగా పెరగడంతో, భారతదేశం త్వరలో జపాన్‌ను అధిగమించనుంది.

గత దశాబ్దంలో యునైటెడ్ కింగ్‌డమ్ జీడీపీ 28 శాతం వృద్ధి చెందగా, ఫ్రాన్స్ జీడీపీలో 38 శాతం వృద్ధిని సాధించింది. 2015లో 2.4 ట్రిలియన్ డాలర్ల నుండి 2025 నాటికి 3.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. 50 శాతం కంటే ఎక్కువ జీడీపీ వృద్ధిని సాధించిన ఇతర అగ్ర ఆర్థిక వ్యవస్థలు రష్యా (57 శాతం), ఆస్ట్రేలియా (58 శాతం), స్పెయిన్ (50 శాతం)గా ఉన్నాయి. భారతదేశ జీడీపీ వృద్ధిని అపూర్వమైన రేటుతో చూపిస్తున్న డేటాను బిజెపి మంత్రి అమిత్ మాల్వియా తన అధికారిక X పోస్ట్ ద్వారా పంచుకున్నారు.ఈ వృద్ధి వేగం భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. 2025 నాటికి జపాన్‌ను, 2027 నాటికి జర్మనీని అధిగమిస్తుందని బీజేపీ నాయకుడు అమిత్ మాల్వియా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో షేర్ చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ అసాధారణ విజయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి, ఆయన ప్రభుత్వ అవిశ్రాంత కృషికి నిదర్శనమని మాల్వియా పేర్కొన్నారు. చురుకైన ఆర్థిక విధానాలు, సాహసోపేతమైన నిర్మాణాత్మక సంస్కరణలు, వ్యాపారాన్ని సులభతరం చేయడంపై అవిశ్రాంత దృష్టి ద్వారా, మోదీ ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మార్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మునుపటి ఏ ప్రభుత్వం సాధించని విజయం ఇది అని అమిత్ మాలవ్య అన్నారు. మార్చి నెల ప్రారంభంలో, భారతదేశం వివేకవంతమైన విధానాలను ప్రశంసిస్తూ, ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు, దేశం బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారడానికి కీలకమైన సంస్కరణలను స్వీకరించడంలో సహాయపడుతుందని పేర్కొంది. అధికనాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు చాలా కీలకమని ఐఎంఎఫ్ కార్యనిర్వాహక బోర్డు పేర్కొంది.దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది.

2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.

## టన్నెల్ నుంచి మరో డెడ్ బాడీ లభ్యం

నేడు రెండో మృతదేహం ఆనవాళ్లు గుర్తించి రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించి మరో మృతదేహాన్ని వెలికితీసి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురి మృతదేహాలు వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. కన్వేయర్ బెల్ట్ కు 50 మీటర్ల దూరంలో మృతదేహం లభ్యమైంది. మినీ హిటాచి తో మట్టి తవ్వుతుండగా మృతదేహం ఆనవాళ్లు కనిపించగా కొన్ని గంటలపాటు శ్రమించి టీమ్ వెలికితీసింది.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 3 లక్షల 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రాజెక్టును 2005లో ప్రారంభించారు. అప్పటినుంచి ప్రభుత్వాలు మారుతున్నా, పనులలో పురోగతి లభించింది. శ్రీశైలం, దేవరకొండల నుంచి రెండువైపులా టన్నెల్ బోరింగ్ మేషిన్లతో 44 కిలోమీటర్ల పొడవున్న టన్నెల్ మార్గాన్ని తవ్వుకుంటూ వస్తున్నారు. కానీ సున్నితమైన ప్రాంతం, నీళ్లు రావడం, బురద ఏర్పడుతండటంతో తవ్వకాలకు పలుమార్లు ఆటంకాలు తలెత్తడంతో రెండు దశాబ్దాలు కావొస్తున్నా టన్నెల్ పనులు పూర్తి కాలేదు. ఇప్పటివరకు దేవరకొండ వైపు నుంచి 23.51 కిలోమీటర్లు పూర్తికాగా, అటు శ్రీశైలం జలాశయం నుంచి 13.95 కిలోమీటర్లు టన్నెల్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 9.5 కిలోమీటర్ల దూరం సొరంగాన్ని పూర్తి చేసి సాగునీరు, తాగునీరు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 18న ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు మళ్లీ చేపట్టగా, శ్రీశైలం వైపు నుంచి 14వ కిలోమీటరు వద్ద సొరంగం లోపల పైకప్పు కూలడంతో ఈ మార్గం మూసుకుపోయి లోపల 8 మంది చిక్కుకుపోయారు. ఫిబ్రవరి 22న ఈ ఘటన జరిగింది. వాస్తవానికి ఆ సమయలో టన్నెల్ లో 50 మంది వరకు ఉండగా, టీబీఎంకు వేరే వైపున ఉన్నవారు రెండు కిలోమీటర్ల దూరం పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నారు. అక్కడి నుంచి లోక్ ట్రైన్‌లో ప్రయాణించి సొరంగం నుంచి బయటకు వచ్చేశారు. సొరంగంలో జరిగిన ప్రమాదంపై అధికారులకు సమాచారం అందించారు. ఆరోజు నుంచి సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. నెల రోజులు దాటినా కేవలం ఇద్దరి మృతదేహాలు వెలికితీయగా, మరో ఆరుగురి ఆచూకీ మార్చి 25 మధ్యాహ్నం నాటికి లభ్యం కాలేదు.

## సురేఖను తప్పించి విజయశాంతి

కాంగ్రెస్ నిర్ణయించింది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, విజయశాంతి, సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావు, వాకిటి శ్రీహరి పేర్లను హై కమాండ్ దాదాపు ఖరారు చేసింది. ఇందులో నలుగురు వ్యక్తులకు మంత్రి పదవి, ఇద్దరు వ్యక్తులకు డిప్యుటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ లిస్ట్‌లో రాజగోపాల్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి పేర్లు మంత్రులుగా దాదాపు ఖరారయ్యాయి. ఇక ఇప్పటికే ఉన్న మంత్రి వర్గం నుంచి ఇద్దరు మంత్రులకు ఉద్వాసక కల్పించే యోచనలో కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ లిస్ట్‌లో మంత్రి కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు పేర్లు ప్రముఖంగా వినిస్తున్నాయి. వీళ్లిద్దరినీ మంత్రి పదవి నుంచి తొలగించి వీళ్ల స్థానంలో కొత్త మంత్రులను నియమించబోతున్నారని టాక్. ఉగాది పూర్తైన తరువాత వీళ్లలో ఎవరెవరికి ఏ మంత్రిత్వశాఖ ఇవ్వబోతున్నారు అనేది ఫైనల్ చేయబోతోంది కాంగ్రెస్.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల తీరుపై సుప్రీం అసహనం

✍ జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 25:

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణలో భాగంగా ప్రతివాదులపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ఇంకా ఎంత టైం ఇవ్వాలి, ఇంకా ఎన్ని రోజులు గడువు ఇవ్వాలంటూ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం పూర్తయిందా అని జడ్జి జస్టిస్ గవాయి చురకలు అంటించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసు పిటిషన్ తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. ఆ విచారణలో ప్రతివాదుల వాదనలు వినే అవకాశం ఉంది.టీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున లాయర్ సుందరం వాదనలు వినిపించారు. టిఆర్ఎస్ నుంచి గెలిచి అధికారం ఉందని కాంగ్రెస్ పార్టీలో చేరారని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని... ఒక ఎమ్మెల్యే అయితే కాంగ్రెస్ టికెట్ మీద లోకసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని బీఆర్ఎస్ నేత పిటిషన్ పై వాదనలు వినిపించారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఏం నిర్ణయం తీసుకుంటారు, ఫిర్యాదులపై 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు కూడా ఇవ్వలేదు. ధర్మాసనం జోక్యం చేసుకున్నాక నామమాత్రంగా నోటీసులిచ్చారు. మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని ఫిబ్రవరి 13వ తేదీన స్పీకర్ నోటీసులు జారీ చేశారు. నెల రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోవలేదు. మేం చేసిన ఫిర్యాదుకు ఏడాది గడుస్తున్నా స్పీకర్ షెడ్యూల్ చేయలేదు.



యథేచ్ఛగా ఫిరాయింపులు జరుగుతున్నా, ఫిర్యాదులు అందుకున్న స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదని' కౌశిక్ రెడ్డి పిటిషన్ పై సీనియర్ లాయర్ సుందరం వాదనలు వినిపించారు.ఫిర్యాదు వచ్చి ఎన్ని రోజులు అవుతుందని ధర్మాసనం ప్రశ్నించింది. కాలయాపన చేసే విధానాలు మానుకోవాలని, ఎమ్మెల్యేల పదవీకాలం పూర్తయ్యేవరకు కాలయాపన చేస్తారా అంటూ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ప్రతివాదులను ప్రశ్నించింది. ఇలాంటి కేసుల్లో రాజ్యాంగ ధర్మాసనాలు కొన్ని తీర్పులు ఇచ్చాయని, ఫిర్యాదులపై పలానా సమయంలో తేల్చాలని తీర్పులు చెప్పలేమని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేమని, వాటిని కాదని ఈ అంశంలో ఎలా ముందుకు వెళ్లగలమని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌లో తెలంగాణ ప్రభుత్వం, స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రతివాదులుగా ఉన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన నోటీసుల గడువు ముగిసినా స్పందించకపోవడంతో స్పీకర్ మార్చి 25లోపు వివరణ ఇవ్వాలని సూచించింది. కానీ ఎమ్మెల్యేలపై ఏం చర్యలు తీసుకున్నారు, పిటిషన్లపై స్పీకర్ వైఖరిపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.

# ఆన్‌లైన్‌లో ఆటలు.. ఛిద్రమవుతున్న జీవితాలు


- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి
- రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


**జయభేరి, మేడ్చల్ :**

ఆన్‌లైన్ బెట్టింగ్, ట్రేడింగ్.. పేరేదైనా భారీగా డబ్బు లొస్తాయని ఆశపడి పెట్టుబడులు పెడితే చివరకు అప్పులే మిగిలి ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలు

### పుట్టగొడుగుల్లా బెట్టింగ్ యాప్స్

మొబైల్ ఓపెన్ చేస్తే చాలు.. 'వన్ ఎక్స్‌బెట్, మెగాపరి, మోస్ట్‌బెట్, పరిపేస, పరిమ్యాచ్, 10సీఆర్ఐసీ, మెల్‌బెట్, మేట్‌బెట్, 1ఎక్స్‌బెట్, బీసీ డాట్‌గేమ్, 22 బెట్స్, రాజా బెట్స్, స్టేక్ డాట్ కమ్, దఫ్ఫా బెట్' వంటి ఎన్నో అఫీషియల్, అన్‌అఫీషియల్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయి. యూట్యూబ్, సోషల్ మీడియా, పలు వెబ్‌సైట్ల లో రూ.100 పెడితే రూ.1000 ఇస్తామంటూ బెట్టింగ్ యాప్స్ యాడ్స్‌పురుతో మోసం చేస్తున్నారు. చేపకు గాలం వేసినట్లు కొత్త కస్టమర్లకు మొదట్లో రూ.100 రూ.200, రూ.1000కు రూ.2000 వేలు, రూ.3000 వేలు ఇస్తూ మెల్లగా యువతను ఊబిలోకి లాగుతున్నారు.







పెరిగిపోతున్నాయి. తాజాగా మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటున్న సోమేశ్ కుమార్ (28) క్రికెట్ బెట్టింగ్ లో డబ్బులు పోగొట్టుకుని మనోవేదనకు గురై మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి రైల్వే స్టేషన్ పరిధిలో రైలు కిందపడి ఆత్మహత్య చేస్తుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం భోగాపురం గ్రామానికి చెందిన రమణ, కనకమ్మా దంపతులు బతుకుదెరువు కోసం 20 ఏళ్ళ క్రితం గుండ్లపోచంపల్లికి వచ్చి నివాసం ఉంటున్నారు. వీరికి ఒక అబ్బాయి ,అమ్మాయి ఇద్దరు సంతానం కాగా సోమేశ్ కుమార్ పెద్దవాడు చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉంటూ డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ ప్రయివేటు కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. గత మూడురోజుల క్రితం ఐపిఎల్ క్రికెట్ టోర్నీ మొదలు అవ్వడంతో సోమేశ్ ఆన్ లైన్ యాప్స్ ల ద్వారా క్రికెట్ బెట్టింగ్ వేస్తూ స్వల్ప కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అత్యాశ ప్రాణం తీసుకునేలా చేసింది. సోమేశ్ సోమవారం రాత్రి ఐపీఎల్ టోర్నీలో లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ కు జరిగిన మ్యాచ్ పై దాదాపు రూ.1 లక్ష రూపాయలు ఆన్ లైన్ లో బెట్టింగ్ వేసాడు. దింతో తను గెలుస్తుంది అనుకున్న లక్నో ఓటమి చెందడంతో పెద్దమొత్తంలో డబ్బుకు పోగొట్టుకున్నాడు. పోగొట్టుకున్న డబ్బులతో సోమేశ్ కుమార్ పని చేస్తున్న కంపెనీకి చెందిన డబ్బులు ఉండటంతో మనస్తాపానికి గురైన సోమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. మృతుడు గతంలో కూడా ఇలాంటి ఆన్ లైన్ బెట్టింగ్ లో దాదాపు రూ.2 లక్షల వరకు డబ్బులు పుగొట్టుకున్నడాని కుటుంబ సభ్యులు మందలించడంతో పద్ధతి మార్చుకొని ఉద్యోగం చేసుకుంటున్నడాని కానీ మళ్ళీ ఇలా బెటింగ్ లకు బానిసగా మరి ప్రాణం తీసుకుంటుడాని ఉహించలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

---



## పెండింగ్ ఉన్న.. కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి

- మాజీ కౌన్సిలర్ బొగ్గులచందు

**జయభేరి, గజ్వేల్, మర్చి 25 :**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్పరిధి 1 వ వార్డు తోని పెండింగ్ తో ఉన్న కొత్త పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని స్థానిక మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు ప్రభుత్వాన్ని కోరారు.1 వార్డు కాలనీ వానులు దరఖాను చేసుకున్న కొత్త పెన్షన్ల రాక కోసం గత కొంత కాలంగా ఎదురు చూస్తున్నా పెన్షన్లు రావడం లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దయాలసిన్ బారిన పడ్డ వృద్ధులకు రూ.2 వేలు, వికలాంగులకు రూ.4 వేలు పెన్షన్లు ఇచ్చి వారి బ్రతుకులు ద్భురం కాకుండా చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్ల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు చేసి వృద్ధులు దివ్యాంగుల బ్రతుకుల్లో సంతోషం నింపాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు అలాగే దివ్యాంగులకు 6 వేలు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు 4 వేలు వెంటనే పెంచి వారిని ఆదుకోవాలని అన్నారు. నిరుపేద వర్గాలకు చేయూత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

---

## నవోదయకు ఎంపిక



**జయభేరి, వర్గల్, మర్చి 25 :**

2025, 26 విద్య సంత్సరానికి గాను నవోదయ విద్యాలయ లో ఆరోతరగతిలో ప్రవేశానికి గత జన వరి 18న అర్హత పరీక్ష నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వర్గల్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ రాజేందర్ ఫలితాలు వెల్లడించారు. ఆరో తరగతిలో 80 సీట్ల పరిమిత సంఖ్యలో భర్తీ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అర్హత పరీక్షలో వర్గల్ మండలం రామక్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న విద్యార్థిని అక్షిత ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రాజు తెలిపారు. అక్షిత నవోదయకు ఎంపిక కావ డంపై ఆమె తల్లిదండ్రులు స్వామి, మనీ, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

---

## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- తెలంగాణ రాష్ట ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ పట్టణంలోని జెవిఆర్ ఫంక్షన్ లో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నూతన మేడ్చల్ మండల, పట్టణ, యువజన మహిళ విభాగం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, జిల్లా అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్త, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్ ఆర్య వైశ్య సంఘం మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చందా నాగ భూషణం గుప్తా, హాజరయ్యారు. వాసవి మాత చిత్ర పటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అమరులైన ఆర్యవైశ్యులకు నివాళులు అర్పించారు.మేడ్చల్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వీరమల్లు శ్రావణ్ గుప్తా, మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సఖిలం చంద్రమౌళి గుప్తా, మేడ్చల్ మండల యువజన అధ్యక్షుడిగా బొమ్మ వెంకట్ గుప్తా,మహిళ అధ్యక్షురాలిగా రాగం సంగీత గుప్తాలతో పాటు కార్యవర్గంలో ఉన్న సభ్యులతో చందా నాగభూషనం గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. నిరుపేద వైశ్య కుటుంబాలకు చేయూత అందిస్తామని ఆమె తెలిపారు.మేడ్చల్ పట్టణంలో వాసవి మాత ఆలయం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముద్రణ చేయించిన ఉగాది పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ, యువజన, మహిళ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

---

## మోటివేషన్ స్పీకర్, ట్రైనర్ గా ఫల్గుణరావుకు ప్రశంసా పత్రం

**జయభేరి, పరవాడ :**




హైదరాబాదు నగరం సికింద్రాబాద్ లోని హెూటల్ మీనేర్వా గ్రాండ్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులకు నైపుణ్యతకు సంబంధించి మార్చి 22 మరియు 23 తేదీలలో రెండు రోజుల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపగత అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు , ప్రెసిడెంట్ రామ చంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి మరియు సినిమా యాక్టర్ ప్రదీప్ పాల్గొనడం జరిగింది ఇందులో కలపాక లో ఎ.పి ట్రాన్స్ కో 400 కె.వి సబ్ స్టేషన్ కు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగిరి ఫల్గుణ రావు అద్భుతంగా ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ప్రముఖ నటుడు ప్రదీప్ కుమార్, వ్యవస్థాపగత అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ గా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఫల్గుణ రావు ని ప్రశంసిస్తూ ఆయన యొక్క సేవలు విద్యార్థులకు, సమాజానికి చాలా అవసరం ఉందని అదేవిధంగా ఆయన నైపుణ్యం ద్వారా సమాజంలో అవగాహన పెంచాలని చెప్పడం జరిగింది. ఫల్గుణ రావు యొక్క ప్రతిభవల్ల ఆ ట్రైనింగ్ లో ఆయనకు మొదటి స్థానం రావడం చాలా గర్వ కారణమని వారు అభినందించారు.

---

## లంబాడి జాతిని అవమానించడమే..

- సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎస్.పి నాయకులు కోర్ర చందు నాయక్

**జయభేరి, దేవరకొండ :**



నియోజకవర్గ సేవాలాల్ బంజారా సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. భద్రాచలం ITDA ప్రాంగణంలో ట్రైబల్ మ్యూజియం ప్రారంభాన్ని అడ్డుకుంటాం లంబాడి ప్రజా సంఘాల ఐక్యవేదిక భద్రాచలం ట్రైబల్ మ్యూజియంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని లంబాడీల జీవనశైలిని ప్రతిబింబించే విధంగా, వారు వాడే గృహో ఉపకరణ పరికరాలు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే కళాకృతులను ఉంచకపోవడం లంబాడి జాతిని అవమానించడమేనని అన్ని గిరిజన తెగల కళాకృతులను మ్యూజియంలో ఏర్పాటు చేసి కేవలం లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన కళాకృతులను మ్యూజియంలో పెట్టకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం లంబాడీలపై వివక్షతగదని భద్రాద్రి జిల్లాలో అత్యధిక జనాభా కలిగి ఉన్న లంబాడీల చరిత్రను భద్రాచలం ITDA ప్రాంగణంలో నూతనంగా ప్రారంభించబోతున్న ట్రైబల్ మ్యూజియంలో వెంటనే ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్, ITDA ప్రాజెక్ట్ అధికారి సమాధానం చెప్పాలని లేనిపక్షంలో శ్రీరామ నవమి రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించే ట్రైబల్ మ్యూజియం ప్రారంభ వేడుకలను అడ్డుకుంటామని లంబాడీ సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరిస్తున్నామని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందు నాయక్ అన్నారు.

---



## ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదు

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం డాక్టర్ హోమి జె బాబా కన్వెన్షన్ సెంటర్ ECIL లో జరిగిన చర్లపల్లి డివిజన్ కి చెందిన గడ్డం ముక్తేశ్ పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భగా NFC నందు ఆయన చేసిన సేవలు అభినందనీయం అని ఆయన అన్నారు. పదవి విరమణ అనంతరం ప్రజా సేవలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో BRS నాయకులు నీమూరీ మహేష్ గౌడ్, రహీం, రాజిరెడ్డి, రమేష్, జై, ప్రసాద్, శ్రీ శైలం, అనిల్, సంపత్, చిన్న, బాలాజీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

---

## తాగునీటి కష్టాలు

- మైసమ్మగూడలో నాలుగు రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని మైసమ్మగూడలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరిగ్గా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా గ్రామంలో నీటి సరఫరా లేకపోవడంతో ఎటువంటి పనులు చేయలేక పోతున్నామని నీటి సరఫరా విషయంపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వివరణ కోరితే సరైన సమాధానం ఇవ్వడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు నీరు లేకుండ ఎలాంటి పనులు చేయలేమని అలాంటిది నాలుగు రోజులుగా ఎలా ఉండాలని ఎండాకాలం మొదలు కాకముందే పరిస్థితి ఇలా ఉంటే ఎండలు ముదిరితే పరిస్థితి ఎలా ఉంటుందో అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మైసమ్మగూడలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. మైసమ్మగూడలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై సంబంధిత అధికారులను వివరణ కోరగా గ్రామంలో సరఫరా చేసే వాటర్ మోటార్ పాడైపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని మరమ్మతులు పూర్తి చేయడానికి మరో రెండు రోజుల పడుతుందని వారు తెలిపారు.

---

## భూగర్భ డ్రైనేజ్ పనులు ప్రారంభం



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాడిగూడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్‌లో భూగర్భ నాళాల నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి,బండారి రవీందర్, వంగూరి పర్మేశ్ హాజరై, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. పీర్జాడిగూడ నగర అభివృద్ధిలో భాగంగా అధునాతన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, భూగర్భ డ్రైనేజ్ నిర్మాణం పూర్తి అయిన తరువాత, కాలనీ వాసులకు మంచి పారిశుధ్య వాతావరణం లభిస్తుందని తెలిపారు.

---

## ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోని 8వ డివిజన్ ప్రజలకు మూసి నీటి నుంచి రక్షణ కల్పించే రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు అంజి రెడ్డి, భండారి రవి, ఐలేష్ యాదవ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఈ రిటైనింగ్ వాల్ ఒక ముఖ్యమైన ప్రాజెక్టుగా మారనుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ, ఈ నిర్మాణం పూర్తయిన తరువాత మూసీ నది వల్ల కలిగే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మరియు స్థానిక ప్రజలకు రక్షణ కల్పించబడుతుందని హామీ ఇచ్చారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దిష్ట గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలు

జయభేరి, ఎల్బీనగర్ :

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డు శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం నందు నిర్వహించిన శ్రీ అలివేలు, మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆ భగవంతుని కృపాకటాక్షాలు పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు లెనిన్ రెడ్డి, మరియు నరసింహ, విజయ లక్ష్మి, దేవాలయ అధ్యక్షులు రామచంద్రం, ప్రధాన కార్యదర్శి శంకర్, శ్యాంసుందర్, శ్రీనివాస్, కోశాకాధికారి శేఖర్ ముదిరాజ్, సహాయక కార్యదర్శి మల్లేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి నరసింహ గౌడ్, లింగస్వామి, సంస్కృతిక కార్యదర్శి నాగరాజు, పవన్ తదితరులు ఉన్నారు.

## అలియాబాద్ మున్సిపాలిటీగా ప్రకటించడంపై నేతల హర్షం

- మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం




జయభేరి, మర్చి 25:

అలియాబాద్ గ్రామాన్ని మున్సిపాలిటీ గా ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం కంఠం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి శ్రీధర్ బాబు అలియాబాద్ ను మున్సిపాలిటీ గా ప్రకటించడంపై ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మారుమూల గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. కాగా అలియాబాద్ మున్సిపాలిటీ గా కావడానికి ప్రత్యేకంగా కృషి చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ లకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ పూర్ మాజీ ఎంపీటీసీ అశోక్ రెడ్డి, అలియాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. యాదగిరి, బి. మల్లేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రాము, నాగమల్ల రెడ్డి, అశోక్, ప్రకాష్ గౌడ్, రాంచందర్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింగ రావు, శివ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి, ఆర్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేటలో ఘనంగా ఇఫ్తార్ విందు



జయభేరి, మర్చి 25:

ఇఫ్తార్ విందులు మతసమరస్యానికి ప్రతీక అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా శామీర్ పేటలోని జామ మసీద్ లో ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారితో కలిసి నమాజ్ చేసి సహపంక్తి భోజనం చేశారు. రంజాన్ మాసం ముస్లిం సోదరులకు పవిత్ర మాసం అని, మల్లారెడ్డి అన్నారు. అదే విధంగా ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం వలన స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. అందుకే ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారని తెలిపారు.

## క్రీడలు మానసిక ఉల్లసాన్ని పెంపొందిస్తాయి



జయభేరి, కొండ మల్లేపల్లి :

కొండమల్లేపల్లి పట్టణం కేంద్రంలో నిర్వహిస్తున్న వాలీబాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ను ప్రారంభించిన BRS రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లసాన్ని పెంపొందిస్తాయి అని అన్నారు. క్రీడాకారులకు తన యొక్క సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటయాని అన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు BRS రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ కి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ యువ నాయకులు ఇస్లావత్ అభిషేక్ నాయక్, నేనావత్ రమేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్, లతీఫ్, హబీబ్, అభిరూబ్, అఖిల్, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశం

- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక - అధ్యక్షులుగా భీమరిశెట్టి, కార్యదర్శిగా ఖాదర్
- ఉపాధ్యక్షులుగా పరవాడ యూనిట్కు చెందిన లాలం
- కృష్ణకు అభినందనలు తెలిపిన పరవాడ న్యూ ప్రెస్ క్లబ్




జయభేరి, పరవాడ:

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ రోటరీ హాల్ నందు నిర్వహించారు.జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్, కార్యదర్శి బి ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీడబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ సిటీ యూనియన్ అధ్యక్షులు పి నారాయణ, విశాఖ సిటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్, విశాఖ సిటీ ఎలక్ట్రాని మీడియా అధ్యక్షులు ఈశ్వరరావు, ఏపీ బీజేప విశాఖ సిటీ కార్యదర్శి కే మదన్, భవ్య డెవలపర్స్ అధినేత కే నాయుడు తదితరులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి అర్హుడైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు ఇంటి స్థలాల మంజూరుకే కృషి చేస్తానని పేర్కొన్నారు.రాష్ట్రంలోనే అతిపెద్ద యూనియన్ గా ఏపీడబ్ల్యూజేఎఫ్ పేరుగాంచిందని పేర్కొన్నారు.

జర్నలిస్టు శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే యూనియన్ గా ఏపీడబ్ల్యూజేఎఫ్ ముందుంటుందని అన్నారు.కార్యక్రమంలో భాగంగా ఏపీ బీజీఎ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.. అనంతరం ఏపీ డబ్లు జె ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గమును ఎన్నికున్నారు.అధ్యక్షులు గా బేమరిశెట్టి వెంకటేష్ (అనకాపల్లి),ప్రధాన కార్యదర్శి గా ఖాదర్ (నర్సీపట్నం) ఉపాధ్యక్షులుగా లాలం కృష్ణారావు (పరవాడ), ఉపాధ్యక్షులుగా ఆర్ చిన్న రామ్ మూర్తి (నర్సీపట్నం), సహాయ కార్యదర్శి గా ధర్మరావు (మాడ్గులు), సహాయ కార్యదర్శి గా వి. జగదీశ్, ఆర్గనైజేషన్ కార్యదర్శి గా టీ. రమేష్ (అనకాపల్లి)కార్యవర్గ సభ్యులు గా నాగు (అనకాపల్లి) త్రిమూర్తులు (నర్సీపట్నం), జాను (మాడుగులు),శ్రీనివాస్ (ఎలమంచిలి), మధు (అనకాపల్లి), పూర్ణ చంద్రారావు ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్షులు కార్యదర్శులు మాట్లాడుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలోపాతానికి కృషి చేస్తాను అని పేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో గల యూనియన్ నాయకులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభం అనే మాయలో పడకండి

- క్రికెట్ బెట్టింగ్ కు దూరంగా ఉండండి
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ సూచన



జయభేరి, పరవాడ:

ఐపీఎల్, టి20 క్రికెట్ మ్యాచ్ లను ఆసరాగా తీసుకొని, అమాయక ప్రజలను మోసగించేందుకు క్రికెట్ బెట్టింగ్ ముఠాలు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయన్నారు. తక్కువ పెట్టుబడి పెట్టి, ఎక్కువ లాభాలు సాధించవచ్చు అనే ఆశ చూపిస్తూ ఈ ముఠాలు ఎందరో యువతను, సామాన్యులను ఆర్థికంగా నాశనం చేస్తున్నాయి. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ యాప్స్ వల్ల, త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

చట్టవిరుద్ధమైన ఈ బెట్టింగ్ యాప్స్ ప్రభావంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అనకాపల్లి జిల్లా పోలీసులు ఇటువంటి క్రికెట్ బెట్టింగ్ ముఠాలను అణచివేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారం స్థానిక పోలీసులకు గాని లేదా డయల్ 100/112 అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరించారు.

అనకాపల్లి జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌కు తావు లేదని ప్రజలను మోసం చేసే వారిని ఉపేక్షించబోమని, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించిన, ప్రోత్సహించిన వారిపై ఆంధ్రప్రదేశ్ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసి వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. యువత ఈ మాయలో పడకుండా, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.



## విగ్రహాలను ఆవిష్కరించాలని కమిషనర్ కు వినతిపత్రం అందజేత

- వినతి పత్రం అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

జయభేరి, గజ్వేల్, మర్చి 25 :

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లో నగర సుందరీకరణలో భాగంగా ముట్ రాజ్ పల్లి లో ఏర్పాటుచేసిన మౌంటెన్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ గాంధీ విగ్రహాల ఆవిష్కరణ చేయాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య కు వినతిపత్రం అందజేశారు, ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చింతకింది మల్లేశం మాట్లాడుతూ.. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ముట్ రాజ్ పల్లిలో మౌంటెన్ లో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరియు మహాత్మా గాంధీ విగ్రహాలు ఆవిష్కరణ కు సిద్ధమై సంవత్సర కాలం గడుస్తున్న ప్రారంభోత్సవం జరగలేదు, వచ్చేనెల ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కు వినతి పత్రం అందజేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నత్తి నరేష్, పెద్దింటి నవీన్, నత్తి శివకుమార్, చింతకింది యాదగిరి, మర్కుక్ మహేష్, నత్తి మల్లేశం, పెద్దింటి కరుణకర్, పెద్దింటి స్వామి, బయ్యారం దాసు, పెద్దింటి రవీందర్, దుబ్బాక మధు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కోసమే ఒకేదేశం ఒకేఎన్నిక

- డా.సిరంగి సంతోష్



జయభేరి, పరకాల, మార్చి 25:

భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన కార్యక్రమం బిజెపి పరకాల పట్టణ శాఖ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా.సిరంగి సంతోష్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశానికి చాలా మేలు జరుగుతుందని, పలు మార్లు ఎన్నికలు నిర్వహించడంతో దేశంపై ఆర్థిక భాగం పడడంతో పాటు సమయం వృధా అవుతుందని అన్నారు. వాటిని తగ్గించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం తేవడానికి కృషిచేస్తున్నారని తెలిపారు. తరచూ ఎన్నికలు రావడం వలన ఎన్నికల కోడ్ ఉండడంతో ఆయా రాష్ట్రాల అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుంది అని అన్నారు. గతంలో జమిలి ఎన్నికలు అనేవి 1952 నుంచే ఎన్నికలు జరిగినవి.

ఇందిరాగాంధీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలను మార్చి రాష్ట్రపతి పాలన పెట్టడం, తద్వారా దేశంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎలక్షన్స్ జరుగుతున్నాయి. కాబట్టి ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఒకే దేశం ఒకే ఎన్నిక ఉంటే దేశం అభివృద్ధి చెందుతుందని భారతీయ జనతా పార్టీ ఆశిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ పి జయంతి లాల్, బిజెపి నాయకులు మార్త రాజభద్రయ్య, చందుపట్ల రాజేందర్ రెడ్డి, బెజ్జంకి పూర్ణ చారి, కుక్కల విజయకుమార్, మార్త బిక్షపతి, సంగా పురుషోత్తం, దంచనాల సత్యనారాయణ, మారేడుగొండ భాస్కరాచారి, ఆకుల రాంబాబు, బూత్ అధ్యక్షులు మరాఠి నరసింగరావు, ముత్యాల దేవేందర్, సంఘ నరేష్, ఉడుత చిరంజీవి, బీరం రాజిరెడ్డి, గాజుల రంజిత్ బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు చేస్తున్నటువంటి మోసం అంతా ఇంత కాదు

- BRS మండల పార్టీ అధ్యక్షులు ఏలుగూరి వల్లపు రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం




జయభేరి, పీ ఏ పల్లి :

దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ శాసనసభలో మాట్లాడిన మాటలు పూర్తి అబద్ధమని BRS మండల పార్టీ అధ్యక్షులు ఏలుగూరి వల్లపు రెడ్డి అన్నారు. అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెట్టి ఈరోజు రైతులకు చేస్తున్నటువంటి మోసం అంతా ఇంత కాదు అని ఆయన మండిపడ్డారు. కేవలం 50 శాతం మందికి రైతు రుణమాఫీ చేసి 100% రుణమాఫీ చేసాము అని చెప్పుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ మాటలు అని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు బాధలు ప్రజలు పడలేకపోతున్నారని, మిషన్ భగీరథ నీళ్లు కరువైపోయాయని ఆయన అన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం బోనస్ 500 రూపాయలు ఇస్తాము అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత బోనస్ ఒక బోగస్ లాగ మారిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలు నెరవేర్చుకోకపోతే. రైతుల పట్ల BRS ప్రభుత్వం ధర్నాలు రాస్తారోకోలు చేసి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టే విధంగా చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి నరసింహ, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శీను, దేపావత్ నరేందర్, సుధాకర్ గౌడ్, గోలి గిరి, మారుపాక జగన్, బొడ్డుపల్లి మహేందర్, బాసిపాక రవి, చిలుముల అనిల్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభోత్సవంలో పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల




జయభేరి, హన్మకొండ, మార్చి 25:

భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఎస్ఎఫ్ఏసి సహకారంతో వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారు సంఘాల నేతృత్వంలో వరంగల్ రంగశాయిపేట నక్కలపల్లి రహదారిలోని జి.ఎం కన్వెన్షన్ హాల్ లో మంగళవారం నుండి 27వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తుల మేళ, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య , తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , కలెక్టర్ శ్రీమతి సత్య శారద దేవి లు కలిసి ప్రారంబించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులు ఉత్పత్తి చేసిన గృహ, వంటగది అవసరాలు, ఆరోగ్యకర అల్పాహారాలు, అందం, ఆరోగ్య సంరక్షణ ఇలా మరెన్నో సహజ సిద్ధమైన మేలైన ఉత్పత్తులను ఆసక్తి వున్న ప్రజలు కొనుగోలు చేయుటకు, రైతు యొక్క ఉత్పాదకతను పెంచటానికి, ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానాల ద్వారా అధిక రాబడి, ఆదాయమును పెంపొందించుటకు కొత్త ఎఫ్పిఓ లు ఏర్పడిన సంవత్సరం నుండి ఐదు సంవత్సరాల వరకు ఎఫ్పిఓల నిర్వహణ, ఉత్పత్తి, ప్రాసెసింగ్, విలువ, మార్కెట్ లింకేజీలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఇలా మొదలైన అంశాలలో మద్దతు అందిస్తామని,

పైన తెలిపినవి 25 నుండి 27 వ తేదీలలో 42 స్టాల్స్ ఏర్పాటు చేయటం జరుతుందని, ప్రతిరోజు నిష్ణాతులైన వారి ద్వారా ఇట్టి పథకం యొక్క ఉద్దేశం, ఎఫ్పిఓ ల రిజిస్ట్రేషన్ విధానం, చేపట్టవలసిన కార్యకలాపాలు, ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు మొదలగు సంబందిత అన్నీ అంశాల మీద సమాచారం ఇస్తూ చర్చలు కల్పిస్తామని అన్నారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

- మాట ఇచ్చినట్టుగానే మంచి పాలన అందిస్తున్నాం
- 15శాతం వృద్ధితోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం
- ప్రతీ అధికారి ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి
- గౌరవభావంతో సంక్షేమ పథకాలు అందించండి
- ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- జిల్లాల కలెక్టర్ల తొలిరోజు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**జయభేరి, అమరావతి, మార్చి 25 :**



విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిన పెట్టి, పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే... దానిని నిలబెట్టుకునేందుకు ఈ 9 నెలల పాలనలో కృషి చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లూ తమ విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లిందని, జరిగిన నష్టాన్ని రాష్ట్రం అధిగమించి అభివృద్ధి చెందేలా, ప్రజలకు సంక్షేమం అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మొదటిరోజు కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి... రానున్న రోజుల్లో ప్రజల కోసం, జిల్లా కోసం ఏం చేయాలనే దానిపై యాక్షన్ ప్లాన్ తయారుచేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజలపై మీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, మీ పనితీరుతో వచ్చే ఫలితాలు వారిపై శాశ్వతంగా చూపిస్తాయని కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు. 26 జిల్లాల కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు.

**ప్రజా సంక్షేమం మీ బాధ్యత :**

సంక్షేమం ఫలాలు సక్రమంగా ప్రజలకు అందాలి. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం చివరిస్థాయి వరకు చేరాలి. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలను దానం చేసినట్లు కాకుండా గౌరవభావంతో ఇవ్వాలి. ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలే ఫస్ట్ విధానంతో ముందుకెళ్లాలి. మీరు చేసే ప్రతిపనిని మేము సమీక్షిస్తున్నాం. పౌరులకు అందించే 22 సేవల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం మా కోసమే పని చేస్తోందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలి.




**డీఎస్సీ మెగా నోటిఫికేషన్ :**

ఏప్రిల్ మొదటి వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పగడ్బంధీగా మెగా డీఎస్సీ నిర్వహించాలి. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయాలనే దస్త్రంపైనే మొదటి సంతకం చేశాం. పాఠశాలలు ప్రారంభించే సమయానికి నియామకాలు పూర్తవ్వాలి. గతంలో రాష్ట్రంలో ఒకేసారి 1.5 లక్షల టీచర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. 80 శాతం ఉపాధ్యాయులను మా హయాంలోనే నియమించాం.

**విజన్ మనకు ఒక డైరెక్షన్ :**

స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్ లో 10 సూత్రాలు పొందుపరిచాం. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు ఉండాల్సిందే. జిల్లాలో విజన్ ఎక్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. నియోజవకర్గాలకు ఎమ్మెల్యే ఛైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రంలో రూ.55 వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఈ ప్రాజెక్టులన్నీ పూర్తవ్వాలి. పర్యావరణ, ఇతర అనుమతులకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి.

**పాలనకు ప్రజామోదం ఉండాలి :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయింది. ఈ 9 నెలల్లో 3వ సారి కలెక్టర్లతో సమావేశం నిర్వహించుకుంటున్నాం. ప్రతి త్రైమాసికానికి ఒక సమావేశం పెట్టుకుని రాబోయే 3 నెలలు ఏం చేయాలో యాక్షన్ ప్లాన్ రూపొందించుకుంటున్నాం. అధికార యంత్రాంగం ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందించడానికి మీరు ప్రయత్నించాలి. గత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంసమే జరిగింది. దీంతో ప్రజల్లో తీవ్రమైన అసహనం వ్యక్తమైంది. ఎన్నికల్లో కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ వచ్చింది. దీనికి కారణం విధ్వంస పాలనను ప్రజలు ఆమోదించలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు కూడా ఎక్కువగానే పెట్టుకున్నారు.

**ఆదాయంతోనే సంక్షేమం సాధ్యం :**

సంక్షేమం, అభివృద్ధి, స్వపరిపాలన అనే మూల స్తంభాలపైనే సుపరిపాలన ఆధార ఉంటుంది. పేదరికం పోయి ప్రజలు సంతోషంగా ఉండాలంటే సంక్షేమ కార్యక్రమాల అమలు తప్పనిసరి. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే తగినంత ఆదాయం రావాలి. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే స్థిరంగా కొనసాగవు. గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్లు అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చాలి, వాటికి వడ్డీలు కట్టాలి.




**చాలా హామీలు నెరవేర్చాం :**

అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక హామీలు నెరవేర్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫింఛన్‌లు రూ.4 వేలు ఇస్తున్నాం. రూ.200 ఉన్న పింఛన్‌ను 2014లో రూ.2 వేలు చేశాం. ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు ఒకేసారి పెంచాం. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు చేశాం. దాన్ని మళ్లీ ఇప్పుడు రూ. 6 వేలకు పెంచాం. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైనవారికి మానవతా దృక్పదంతో రూ.15 వేలు ఇస్తున్నాం. ఇంతమంచి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ప్రజలకు తెలియజేయాలి. అందుకే ప్రతినెలా 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమం నిర్వహిస్తున్నాం.




**అన్నా క్యాంటీన్‌లు సందర్శించండి :**

రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడానికి 204 అన్నా క్యాంటీన్‌లు నెలకొల్పాం. కలెక్టర్‌లు కూడా అన్నా క్యాంటీన్‌లను సందర్శించాలి. దీపం2 పథకం కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్‌లు ఇస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం చెత్త పన్ను, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217 జీవో రద్దు చేశాం. గీత కార్మికులకు మద్యం షాపులు 10 శాతం కేటాయించాం. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేశాం. మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నాం. బీసీ, ఎస్సీలకు ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా ఇస్తున్నాం. ఈ వేసవి కాలంలో వడదెబ్బ తగిలి ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ జాగ్రత్తలు సూచించాలి. ఎక్కడా తాగునీరు లేదనే మాట రాకూడదు.

**2027 కల్లా పోలవరం నిర్మాణం పూర్తి :**

పోలవరాన్ని కేంద్ర సహకారంతో గాడినపెట్టాం. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతి రాజధాని పనులు కూడా చేపట్టాం. ప్రపంచబ్యాంకు, ఏడీబీ వంటి సంస్థల నుంచి ఆర్థిక సాయం తీసుకుంటున్నాం. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌గా అమరావతి అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలూ భాగస్వాములయ్యేలా చర్యలు ఉండాలి. నక్కపల్లి స్టీల్ ప్లాంట్ నిర్మాణంలోనూ ఈ తరహా మోడల్స్ చేపట్టాలి. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం అమరావతితో ప్రారంభమైంది. అమరావతి రాజధానికి కొత్త రైల్వేలైన్‌తో పాటు, విశాఖ రైల్వేజోన్ సాధించాం.

**ప్రయాణం సాఫీగా సాగేలా రోడ్లు :**

గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదు. ఎక్కడ చూసినా గోతులే ఉన్నాయి. అందుకే రూ.861 కోట్లతో 20 వేల కి.మీ మేర గుంతలు పూడ్చివేస్తున్నాం. దాదాపు 95 శాతం మేర పనులు పూర్తయ్యాయి. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేవారికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీ ఇస్తున్నాయి. రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యా వ్యవస్థను ప్రక్షాళను చేశాం. రూ.4 వేల కోట్లతో 40 వేల పనులను పల్లె పండుగ కార్యక్రమం కింద ప్రారంభించాం. వాటర్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టాలి. మే నెలలో తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తాం. స్కూళ్లు తెరిచేలోపు అమ్మఒడి అందజేస్తాం. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు అందిస్తాం.

**జీఎస్డీపీ పెరుగుదల తప్పనిసరి :**

విజన్ అమల్లో రాజకీయ ఒత్తిడిలు తలెత్తకుండా జిల్లాలకు స్థానికేతర అధికారులను జిల్లా ప్లానింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమించాం. జిల్లాల్లో సంపద సృష్టికి ఏం చేయగలుగుతారో ఆలోచించాలి. జీఎస్డీపీ పెరుగుదల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి, ప్రభుత్వ ఆదాయం పెరుగుతంది, తద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు. రూ.3.27 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపట్టాం. వచ్చే ఏడాదికి 15 శాతం తగ్గకుండా జీఎస్డీపీ సాధించేలా కలెక్టర్‌లు కృషిచేయాలి. 201419 మధ్య 13.5 శాతం గ్రోత్ రేట్ ఉంటే 201924 మధ్య 10.32 శాతానికి తగ్గింది. 202425 మధ్య 12.02 గ్రోత్‌రేట్ సాధించాం. 1 శాతం గ్రోత్ రేట్ పెరిగితే రూ.15 వేల కోట్ల ఆదాయం వస్తుంది. 2047 నాటికి రూ.54.60 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. తలసరి ఆదాయం 202324 మధ్య రూ.2.66 లక్షల ఉంటే, 202425 మధ్య రూ.2.98 లక్షలకు పెరిగింది. స్వర్ణాంధ్ర విజన్‌లో రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలనేది మన సంకల్పం.



**వ్యవసాయరంగం పైనా దృష్టి పెట్టాలి :**

ఏపీ అంటే ఒకప్పుడు అన్నపూర్ణగా పేరుంది. జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైన దృష్టి పెట్టాలి. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు రావాలి. హార్టికల్చర్‌కు సీమలో మంచి అవకాశాలు ఉన్నాయి. సీమలో ఇప్పుడు డెల్టా కంటే మంచి ఆదాయం వస్తోంది. అనంతపురం ఒకప్పుడు కరువు జిల్లాగా మారుతుంది అనుకున్నాం... కానీ హార్టికల్చర్, పరిశ్రమల రాకతో రాష్ట్రంలో 5వ ఆర్థిక వ్యవస్థగా మారింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ఎనర్జీ పరిశ్రమలు వస్తున్నాయి. రాబోయే 5 ఏళ్లలో గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు సాధించేలా ముందుకెళ్తున్నాం. పర్యాటకంలో 20 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పెట్టుకున్నాం.

**బకాయిలు అన్నీ వసూలు చేయాలి :**

జీఎస్టీపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలి. పన్ను ఎగవేతదారుల పట్ల కఠినంగా ఉండాలి. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా ప్రక్షాళన చేస్తాం. మున్సిపల్ శాఖలో ఫిర్యాదుల రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్లు భావిస్తాం. శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు. గంజాయి సరఫరా చేసి, రౌడీయిజం చేసేవారి పట్ల ఉక్కుపాదం మోపండి. శాంతిభద్రతల పరిరక్షణకు కలెక్టర్లు జిల్లా ఎస్పీలతో కలిసి పనిచేయాలి.

# వేడినీళ్ల బకెట్ లో పడి చిన్నారి మృతి

**జయభేరి, మేడ్చల్:**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు వేడి నీళ్లు కాస్తున్న హీటర్ బకెట్ లో పడి నాలుగేళ్ల చిన్నారి బన్నీ మృతి చెందాడు.బాలాజీ నగర్ హనుమాన్ దేవాలయం వద్ద నివాసం ఉండే తన సోదరుడి ఇంట్లో ఘటన చోటు చేసుకున్నట్లు బాలుడు తండ్రి నరసింహ తెలిపారు. కుటుంబ సమేతంగా నిన్న తన సోదరుడు ఇంటికి వెళ్లగా ఉదయాన్నే వేడి నీళ్లు కాస్తున్న హీటర్ బకెట్లో బాలుడు అకస్మాత్తుగా పడిపోయాడు. వేడినీళ్లలో పడిపోవడంతో బాలుడు ఒళ్లంతా తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని హుటాహుటిన స్థానికంగా ఉండే ప్రైవేటు ఆసుపత్రికి తరలించడం చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూనే బాలుడు మృతి చెందినట్లు వైద్యులకు ధ్రువీకరించారు. ఈ ఘటనపై బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జవహర్ నగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చిన్నారి మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కాలేజీల పై చర్యలు తీసుకోవాలి

**జయభేరి, హన్మకొండ, మార్చి 25:**

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వరంగల్ గ్రేటర్ నగరంలో వేసవిలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీల పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ, రాంనగర్ లోని సుందరయ్య భవన్ లో డివైఎఫ్ఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి మానసిక ప్రశాంతత అవసరమని డాక్టర్లు చెబుతున్న అవేమీ పట్టించుకోకుండా ప్రైవేటు జూనియర్ కాలేజీలు విద్యార్థుల తల్లి దండ్రుల నుంచి డబ్బులు వసూలు చేయడం కోసం కోచింగ్ ల పేరుతో క్లాసులు నిర్వహించి విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారని, ప్రైవేటు కాలేజీలకు ర్యాంకులే కావాలి తప్ప విద్యార్థుల ఆరోగ్యం అవసరం లేదని, కోచింగ్ ల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తుంటే జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారో అని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రకటించిన బోర్డు ప్రైవేటుగా కోచింగ్ నిర్వహిస్తున్న కాలేజీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తి అయిన విద్యార్థులకు సెకండ్ ఇయర్ క్లాసులు నిర్వహిస్తున్నారని, ముందస్తుగా క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు కట్టాలని వేధిస్తున్నారని, ఇంటర్ బోర్డు షెడ్యూలు ప్రకటించక ముందే అడ్మిషన్లు నిర్వహిస్తూ, ముందస్తు క్లాసులు, కోచింగ్ నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజి లపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని డివైఎఫ్ఐ కార్యదర్శి తిరుపతి హెచ్చరించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి డి. సాంబమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, నాయకులు మంద సుచందర్, ఓ.చిరంజీవి, యువన్, కర్ణాకర్, అనిల్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వాహణ

**జయభేరి, గజ్వేల్, మార్చి 25 :**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ లోని స్థానిక ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలో గజ్వేల్ లో హెల్త్ క్లబ్, జంతుశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో ఈశ్వరసాయి నర్సింగ్ హోమ్ గజ్వేల్ వారి సహకారంతో 200మంది విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అని త అబ్రహం అధ్యక్షత వహించగా డాక్టర్ ఏ.శైలజ, గైనకాల జిస్టు విద్యార్థినులను ఉద్దేశించి, మహిళలలో హిమోగ్లోబిన్ ప్రాముఖ్యత దాని తగ్గుదల వలన కలిగే సమస్యలు, సమతుల ఆహార ప్రాముఖ్యత, పాటించవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, హెల్త్ క్లబ్ కన్వీనర్ వి.శ్రీలత, ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఎమ్.ఎమ్.లక్ష్మి, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.జయరాజు, టిఎస్కేసి కోఆర్డినేటర్ డాక్టర్ జె.ఉమారాణి, డాక్టర్లు మురళీదర్, బాలచంద్రం, సిహశ్రీచ్, శోభారాణి, ఆర్.సునీత, పి.జ్యోతి, ఎన్.శ్రీలత ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై వివరణ

- లాల్ గడి మలక్ పేట లో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగహన




**జయభేరి, మర్చి 25:**

లాల్ గడి మలక్ పేట్ లో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులపై జరుగుతున్న అక్రమాలు మరియు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై వివరించారు. ఈ కార్యక్రమనకి రాష్ట్ర ఎన్ ఎస్ ఎస్ అధికారి నర్సింహా గౌడ్, హాజరయ్యారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అదేవిధంగా సమయాన్ని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి మరియు లక్ష్య సాధన కోసం పట్టుదలతో కృషి చేయాలని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ అధికారి శోభారాణి, పంచాయతీ చైర్మన్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డా. మాధవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేతా

- ఆర్థిక సహాయం చేస్తున్న మ్యాకల కనకయ్య ముదిరాజ్



**జయభేరి, మార్కుక్, మర్చి 25 :**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన కుమ్మరి బలనర్సు వయస్సు 45స" గత వారం రోజుల క్రితం అనారోగ్యం తో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మార్కుక్ మండల్ బి సి సెల్ అధ్యక్షుడు సిద్దిపేట్ జిల్లా ముదిరాజ్ సంఘం ఉప అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు వారితో పాట చెక్కల నర్సింలు కుమ్మరి పోచయ్య కొట్టాల మహేష్ తదితరులు వున్నారు.

# ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

- చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయం -- సిఐ సైదా





**జయభేరి, గజ్వేల్, మర్చి 25 :**

వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆభినందయమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. మంగళవారం ధర్మారెడ్డిపల్లి లో అదే గ్రామానికి చెందిన ప్రగతి యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ సైదా, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిని నర్సింహులుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావడం అభినందనీయం అని ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని,నిత్యం పరిసర గ్రామాల నుంచి వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలి వేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు యువత చెడు అలవాట్లకు పోకుండా గ్రామభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని వారు సూచించారు అందరూ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి ఎన్నో గ్రామభివృధి కీ ఉపయోగపడు సామాజిక కార్యక్రమాలు చేస్తూ ముందికు సాగుతున్న ప్రగతి యూత్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యూత్ అసోసియేషన్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తస్నాదియ్యా.. 23 ఏళ్లకే 250 కోట్ల సంపాదన..

సినీరంగంలోకి అడుగుపెట్టి అందం, అభినయంతో కట్టిపడేసింది ఈ ముద్దుగుమ్మ. తన ప్రతిభతో దేశవ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకున్న ఈ వయ్యారి.. 23 ఏళ్ల వయసుకే రూ. 250 కోట్ల ఆస్తులు సంపాదించింది. ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ జన్నత్ జుబేర్ రహ్మానీ. చిన్న వయసులోనే సినీరంగంలోకి అడుగుపెట్టి స్టార్ హీరోయిన్లకు మించిన క్రేజ్ సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ.. బుల్లితెరపై పలు సీరియల్స్ చేసింది. అందం, ఆస్తులు, ఫ్యాన్ పాలోయింగ్ పరంగా అగ్ర తారలను వెనక్కు నెట్టింది. అంతేకాదు.. టీవీ రంగంలో అత్యధిక పారితోషికం తీసుకునే నటిగా మారింది. ప్రస్తుతం బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ కంటే ఎక్కువగా ఇన్ స్టాలో ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. షారుఖ్ ఖాన్ కు ఇన్ స్టాలో 46 మిలియన్ ఫాలోవర్స్ ఉంటే.. జన్నత్ జుబైర్ కు ఇన్ స్టాలో 49.7 మిలియన్ మంది ఫాలోవర్స్ ఉన్నారు. 2001 ఆగస్టు 29న ముంబైలో జన్మించిన జన్నత్.. చైల్డ్ ఆర్టిస్టుగా సినీరంగంలోకి అడుగుపెట్టింది. 2008లో చాంద్ కే పర్ చలో సీరియల్ ద్వారా బుల్లితెరపైకి అడుగుపెట్టింది. ఆ తర్వాత దిల్ మిల్ గయే, కాశీ: అబ్ నా రహే తేరా కాగ్ కోరా, తు ఆషికి, ఫియర్ ఫైల్స్ వంటి షోస్ చేసింది. అలాగే హిందీలో పలు రియాల్టీ షోలలో పాల్గొంది. ఖత్రోన్ కే ఖిలాడీ షోలో ఒక్క ఎపిసోడ్ కోసం రూ. 18 లక్షలు తీసుకుంది. అలాగే నవ్వు చెఫ్ షోలో ఒక్కో ఎపిసోడ్ కు రూ. 2 లక్షలు రెమ్యునరేషన్ తీసుకుంది. జన్నత్ వయసు 21 ఏళ్ల వయసులోనే ముంబైలో సొంతంగా ఇల్లు కొనుగోలు చేసింది. సినిమాల్లో పారితోషికమే కాకుండా వ్యాపార రంగంలోనూ రాణిస్తుంది. ప్రస్తుతం ఆమె ఆస్తులు రూ. 250 కోట్లు.



# దెబ్బకు సినిమాలకు దూరంగా..

స్టార్ హీరోలతో వరుస సినిమాల్లో నటిస్తూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. కానీ ఈ ముద్దుగుమ్మకు సినీరంగంలో సరైన బ్రేక్ రాలేదు. అందం, అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. స్టార్ హీరోల సరసన ఛాన్స్ కొట్టేసింది. కానీ ఈ అమ్మడుకు మాత్రం సరైన క్రేజ్ రాలేదు. తెలుగుతోపాటు తమిళం, కన్నడ, మలయాళ చిత్రాల్లో మెరిసిన ఈ వయ్యారి.. నటిగా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. స్టార్ హీరోయిన్ గా కాకుండా.. సెకండ్ కథానాయికగానూ మెరిసింది. కానీ ఈ బ్యూటీకి ఎందుకోగానీ ఈ ముద్దగుమ్మకు స్టార్ డమ్ రాలేదు. తెలుగులో అల్లు అర్జున్, గోపిచంద్, రానా, సిద్ధార్థ్, విజయ్ దేవరకొండ, కళ్యాణ్ రామ్ వంటి స్టార్ హీరోలకు జోడిగా కనిపించింది. కానీ అంతగా బ్రేక్ రాకపోవడంతో నెమ్మదిగా సినిమాలకు దూరమయ్యింది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ క్యాథరిన్ ట్రెసా. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన అమ్మాయి. ఇద్దరమ్మాయిలు, సరైనోడు, బింబిసార వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. వరుణ్ సందేశ్ నటించిన చమ్మక్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. ఆ తర్వాత అల్లు అర్జున్ సరసన ఇద్దరమ్మాయిలతో సినిమాలో మెరిసింది. తెలుగులో అనేక చిత్రాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి మాత్రం క్రేజ్ రాలేదు. ఇటీవలే తనకు ఉన్న ఓ వింత జబ్బును బయట పెట్టి వార్తల్లో నిలిచింది. ప్రస్తుతం ఈ బ్యూటీ నెట్టింట యాక్టివ్ గా ఉంటూ క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com